క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సీఐ మస్తానయ్య



నూజివీడు: మాదక ద్రవ్యాల వాడకం అనేది ప్రమాదకరమైన వ్యసనమని, విద్యార్థులు దీనికి దూరంగా ఉండాలని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య అన్నారు. పట్టణంలోని శ్రీ శారదా డిగ్రీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం కంటే తీవ్రమైన ప్రభావాన్ని మాదక ద్రవ్యాలు కలిగిస్తాయన్నారు. నల్లమందు, మార్ఫిన్, గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితాలను కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. వీటికి అలవాటైన యువకులు, విద్యార్థులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోతారని చెప్పారు. విద్యార్థులు తమ భవిష్యత్‌పైనే దృష్టి సారించి చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఇరువురు దాతలు బుధవారం విరాళాలు అందజేశారు. స్వామి అయ్యప్ప దేవాలయ ధర్మకర్త, పాఠశాల పూర్వ విద్యార్థి సంకా రాజారావు, తిరువూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకుల దుర్గాప్రసాద్ రూ.5 వేల చొప్పున పాఠశాల అభివృద్ధికి విరాళంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరరావుకు అందించారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

ముసునూరు: అయోధ్య నగరంలో జరిగిన బాల రామ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పలు రామాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, ఏకనామస్మరణ నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ మల్లవల్లి కోటేశ్వరరావు, ఉప కన్వీనర్ మామిడిశెట్టి గిరిబాబు నాయుడు ఆధ్వర్యంలో చెక్కపల్లి దివాణం సెంటర్‌లోని కోదండ రామాలయం వద్ద స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజాదికాలు ఏక నామస్మరణ జరిగాయి. కార్యక్రమంలో నాగేశ్వరరావు, భాస్కరరావు, జగన్మోహనరావు, అప్పారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి



తిరువూరు: వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి సేవా కమిటీ కన్వీనర్ వూటుకూరు యజ్ఞకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రంగమ్మ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

చింపాంజీ వేషధారణతో కోతులకు చెక్



చాట్రాయి: కోతుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. టపాసులు పేల్చడం, కర్రలతో తోలడం, కొండముచ్చులతో బెదిరించడం, మనుషులు పోలిన బొమ్మలను అమర్చడం తదితర చర్యలు చేపడుతున్నా కోతులు బెదరడం లేదు. నోటి కాడికి వచ్చిన పంటలను కోతులు చిందర వందర చేసి రైతులను నష్టపరుస్తున్నాయి. కనీసం ఇంటి పెరట్లో కూరగాయలు పెంచుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో మండలంలోని పోలవరం రైతులు చింపాంజీ వేషధారణ ఉండి పంటలను రక్షించుకుంటున్నారు. చింపాంజీ వేషధారణలో ఉన్న రైతులను చూసి కోతులు పరుగులు పెడుతున్నాయి. చింపాంజీ వేషధారణతో పంటలకు నష్టం తగ్గి కొద్దిగ ఉప శమనం కలుగుతోందని రైతులు చెబుతున్నారు.

ఈదర సహాయ మాత ఉత్సవాలు

ఆగిరిపల్లి: ఈదర గ్రామంలో నిత్య సహాయ మాత ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం తేరు ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. సహాయ మాత విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తేరు ప్రదక్షిణ, గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం పాప సంకీర్తన జరిగింది. రాత్రి రెవరెండ్ ఫాదర్ లాము జయరాజ్ దివ్య బలి పూజ సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- రోడ్ల మార్జిన్లలో పేరుకుపోతున్న చెత్త
- కంపు కొడుతున్న పల్లెలు
- గ్రామాల్లో దోమల దండయాత్ర



మీర్జాపురంలో రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త



సిద్ధార్థ నగర్‌లో రోడ్డు వెంబడి చెత్త :



మొర్సపూడిలో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం

నూజివీడు: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త వేసుకునేందుకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేసినప్పటికీ ప్రజలు మాత్రం చెత్తను వీధుల్లోనూ, రోడ్ల పక్క మార్జిన్లలో, కాలువల్లో పడవేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించకుండా నెలల తరబడి ఉంచడంతో రోడ్ల పక్కన పేరుకుపోతోంది. మండలంలోని ఏ గ్రామంలో రోడ్లను చూసినా మార్జిన్లలో చెత్త దర్శనమిస్తోంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు కదలక నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల దాడితో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

ప్రచారం కోసమే స్వచ్ఛతా కార్యక్రమాలు

పల్లెలన్నింటిని పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గత ఏడాది అక్టోబర్ నెలలో స్వచ్ఛతా హీ సేవ మాసోత్సవాలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ప్రచారం కోసం తప్పితే ఒక్క గ్రామంలో కూడా పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుపడలేదు. అధికారులు, డ్వాక్రా మహిళలను సమీకరించి సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించి మమ అనిపించారే తప్ప పారిశుద్ధ్యంపై ప్రజలకు ఏ మాత్రం అవగాహన కల్పించలేదు. దీంతో ఇది ఫొటో కార్యక్రమంగా మిగిలిపోయింది.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

మండలంలోని ప్రతి గ్రామంలో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాన్ని బట్టి రూ.6 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు వ్యయం చేసి సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. వాటిని నిర్మించారే గాని వాటిల్లోకి చెత్తను తోలేదీ లేదు..వర్మీకంపోస్టు తయారు చేసిందీ లేదు. మీర్జాపురం, సిద్ధార్థ నగర్, తుక్కులూరు, అన్నవరం తదితర గ్రామాల్లో చెత్త రోడ్ల వెంట పెద్ద ఎత్తున పేరుకుపోయింది. గ్రామాల్లో మురుగునీటి గుంతల్లో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండి దోమలు పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

తుప్పు పట్టిన ఆటో రిక్షాలు

గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి చెత్తను తరలించేందుకు బ్యాటరీ ఆటోలను అందజేసింది. అయితే ఆ ఆటోలన్నీ నాసిరకం కావడంతో అవి పట్టుమని ఏడాది పాటు కూడా పనిచేయకుండా మూలన పడ్డాయి. చార్జింగ్ ఎక్కకపోవడం, బ్యాటరీలు పనిచేయకపోవడం తదితర సమస్యలతో వాటిని మరమ్మతులు చేసే వారు కూడా లేకపోవడంతో అవన్నీ మూలన పడి తుప్పుపట్టిపోయాయి. గ్రీన్ అంబాసిడర్‌లు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.

చెత్తను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ పెడతాం



పంచాయతీల్లో చెత్తను తరలించేందుకు ఎలాంటి వాహనాలు లేవు. ట్రాక్టర్లు కావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపుతున్నాం. మర్రిబంధం నుంచి తుక్కులూరు వరకు జాతీయ రహదారి వెంబడి చెత్తను తొలగించేందుకు నాలుగైదు రోజుల్లో సిబ్బంది అందరితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

– చెన్నా రాఘవేంద్రనాథ్, ఎంపీడీఓ, నూజివీడు

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

దాములూరు(ఇబ్రహీంపట్నం): ఆరోగ్యానికి భరోసా కల్పించే ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మండలంలోని దాములూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాగు చేస్తున్న పంటలు, సాగు వివరాలు, ఉపయోగిస్తున్న ఎరువులు, వాటి లభ్యత తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగు చేస్తున్న శనగ పంట (జేజీ–11) రకం ఎండిపోయి పంట దిగుబడి తగ్గిపోతోందని, పంట మార్పిడికి దాములూరు పంపింగ్ స్కీమ్ ద్వారా నీటిని అందించాలని రైతులు కోరారు. నీటి సదుపాయం ఉంటే మొక్కజొన్న, జొన్న వంటి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కర్నూలు, ఆదోనిలో వినియోగించే శనగ రకం (ఎన్‌బీఈజీ 452) అందించాలని రైతులు కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ భావితరానికి ఆరోగ్యం అందించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరించాలన్నారు. అగ్రి కనెక్ట్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులను పొలానికి తీసుకువెళ్లి శనగ పంటను చూపించారు. సర్పంచ్ సీహెచ్ మధుసూదనరావు, ఏఓ డి.శైలజ, వీఏఓ నరేంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుపై ఆసక్తి



ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా గుమ్మడి సాగు



ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా మొక్కజొన్న సాగు

- ఉచిత విద్యుత్ అమలుతో బోర్లువేసి సాగు
- ఒక పంట పోయినా మరో పంటలో లాభం

చాట్రాయి: అంతర పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏదో ఒక పంట వేసి తగిన ఆదాయం రాక సాగులో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో ప్రధాన పంటతో పాటు అంతర పంటలను సాగు చేస్తూ తగిన ఆదాయం పొందుతున్నారు. చాలా కాలం వరకు ఒక పంట మాత్రమే సాగు చేసేవారు. వ్యవసాయంలో సాంకేతికత రావడం, ఉచిత విద్యుత్ అమలు చేయడంతో బోర్లు వేసి రైతులు అంతర పంటలను పండిస్తున్నారు. ప్రధాన పంటలైన ఆయిల్‌పామ్, కొబ్బరి, నిమ్మ, బత్తాయి, మామిడి లాంటి దీర్ఘకాలిక పంటలు చేతికి రావాలంటే కనీసం మూడు నుంచి ఐదేళ్లు పడుతోంది. దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొబ్బరి, నిమ్మ, ఆయిల్‌పామ్ పంటలు చేతికి రావాలంటే మూడు నుంచి నాలుగేళ్లు పడుతుండటంతో అంతర పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము పంటలతో పాటు కూరగాయల సాగు కూడా చేస్తున్నారు. మామిడి సాగులో కూడా ఖరీఫ్ వరి సాగు చేస్తూ అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

అంతర పంటలతో భూ సంరక్షణ



అంతర పంటలు వేయడం వలన భూమిని సంరక్షించుకోవచ్చు. అధిక గాలులు వీచినప్పుడు మట్టి కొట్టుకుపోకుండా దోహదపడుతుంది. నత్రజని, సేంద్రియ కర్బనాన్ని పెంపొందించుకోవడమే కాకుండా కలుపుని కూడా నివారించుకునేందుకు అంతర పంటలు దోహదపడతాయి. ప్రధాన పంట ధరల్లో హెచ్చు తగ్గులు ఏర్పడినప్పుడు అంతర పంటల వలన వచ్చే ఆదాయం ఆదుకుంటుంది. అంతర పంటలతో ఖర్చులు తగ్గడంతోపాటు అధిక ఆదాయం సమకూర్చుకోవచ్చు. –బి.శివశంకర్, వ్యవసాయాధికారి, చాట్రాయి

పారదర్శకంగా ఎన్‌సీడీ సర్వే

డీఎంహెచ్‌ఓ సుహాసిని



సర్వేలో మొబైల్ యాప్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

ఇబ్రహీంపట్నం: ఎన్‌సీడీ 3.0 సర్వే పారదర్శకంగా నిర్వహించి వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.సుహాసిని అన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఆకాంక్షిత) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌సీడీ సర్వే నిర్వహించారు. ఎన్‌సీడీ సర్వేను దాములూరు, గుంటుపల్లి, మూలపాడు గ్రామాల్లో బుధవారం ప్రారంభించారు. మూలపాడు గ్రామంలో డీఎంహెచ్‌ఓ సుహాసిని పాల్గొని సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సర్వే ద్వారా 30 ఏళ్లు పైబడిన ప్రజలను లక్ష్యంగా చేసుకుని బీపీ, మధుమేహం, తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎన్‌సీడీ మొబైల్ యాప్‌ను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎంపీడీఓ సునీతశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పాల ఉత్పత్తితో అదనపు ఆదాయం

చౌటపల్లి(తిరువూరురూరల్): వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను కూడా నిర్వహించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి అన్నారు. చౌటపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పాడి గేదెలను పోషించడంతో పాల ఉత్పత్తితో పాటు పశువుల పేడతో పొలానికి సేంద్రియ ఎరువుల సరఫరాకు కూడా అవకాశం ఉంటుందన్నారు. సమగ్ర పంటల యాజమాన్యంతో సాగు ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకునేందుకు రైతులు ప్రయత్నించాలని సూచించారు. తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ, పశు వైద్యాధికారి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తాతకుంట్లలో 'పొలం పిలుస్తోంది'

విస్సన్నపేట: మండలంలోని తాతకుంట్లలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు క్షేత్ర ప్రదర్శన నిర్వహించి మామిడి, మొక్కజొన్న పొలాల సాగుపై సూచనలు చేశారు. ఖరీఫ్, రబీ పంటల సాగు పద్ధతులు, పంటలపై ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు.

తెలుగుతల్లి విగ్రహం ఆవిష్కరణ



ఆగిరిపల్లి: మండలంలోని తాడేపల్లి చొప్పరమెట్లలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాలలో ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహాన్ని శాంత బయోటిక్ అధినేత, పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంస్కారవంతులు జీవితంలో రాణిస్తారని, అది విద్య ద్వారా ప్రాప్తిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో ముందుకు సాగి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయనను పాఠశాల చైర్మన్ కొసరాజు కోటేశ్వరరావు సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ ఆనంద్ కుమార్, పాఠశాల డీన్ రఘురాం, ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు ప్రారంభించాలని వినతి

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులకు అవసరమైన బస్సు సర్వీసులను ప్రారంభించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ విజయవాడ ఆర్టీసీ రీజినల్ మేనేజరు ఎంవైదానంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌కు రాత్రివేళ స్లీపర్ సర్వీసులు, ఉదయం సూపర్ లగ్జరీ సర్వీసు, మచిలీపట్నానికి, వావిలాల, పెద్దవరం చెన్నూరు, పినపాక, వైరా మీదుగా ఖమ్మం సర్వీసు ప్రారంభించాలని కోరారు.

ఆటో డ్రైవర్ల నిరసన

ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్‌లో ఆటోలకు ప్యాసింజర్‌లను ఎక్కించుకునే అవకాశం కల్పించాలని సీఐటీయూ అనుబంధ ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు కోరారు. ఇటీవలి కాలంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రింగ్ సెంటర్‌లో ఆటోలు నిలపకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవడంపై వారు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. రింగ్ సెంటర్‌కు దూరంగా ఆటోలు నిలపడం వలన ప్రయాణికులు రావడం లేదని, కిరాయిలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఆర్.చంటి, చందు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

తిరువూరు: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్నందిస్తోందని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ అన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని వ్యవసాయ శాఖాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. దేవదత్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో సాగు ప్రయోజనాలను వివరించారు. నియోజకవర్గంలో కనీసం 2,300 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి విజయ కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు కెనడీ, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

లక్ష్మీపురం(తిరువూరురూరల్): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో బుధవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. పశువైద్యాధికారి శ్వేత సీజనల్ వ్యాధులపై పశు యజమానులకు అవగాహన కల్పించారు. బొబ్బ వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

మూడు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ముసునూరు: పశువుల్లో సంభవించే వ్యాధుల నివారణకు పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని మండల పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం అక్కిరెడ్డిగూడెం, గోపవరం–వెంకటాపురం గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 90 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. 1,020 దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమాల్లో పశు వైద్య సహాయక సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.



మంచులోనే డీఏఆర్ కళాశాలలో బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

కమ్మేసిన మంచు దుప్పటి

మంచుకురిసే వేళలో ప్రకృతి అందాలు వర్ణనాతీతం. బుధవారం ఉదయం నూజివీడు పట్టణంలో హిమసోయగం పట్టణ ప్రజలకు కనువిందు చేసింది. ఇళ్లపై తెల్లటి దుప్పటి మాదిరిగా మంచు పరుచుకుంది. సూరీడు కూడా మంచు పొరలు చీల్చుకుంటూ ఉదయించి వెలుగులు ప్రసరింపజేసేందుకు అష్టకష్టాలు పడ్డాడు. పచ్చని పంట పొలాలు, అందులోని పంటపై కూడా మంచు పరదా కప్పేసింది. వేకువ జామున 5.30 నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు పరదాలు తొలగిపోలేదు. ఉదయం 8 గంటల వరకు వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.

– నూజివీడు



ఉదయం 8.30 గంటలకు పట్టణంపై అలముకున్న పొగ మంచు



ఉదయం 8 గంటలకు లైట్లు వేసుకుని వస్తున్న వాహన చోదకులు

కృష్ణా నీటిని సరఫరా చేయాలి

మైలవరం: ఎ.కొండూరు మండల పరిధిలోని గ్రామీణులకు ముఖ్యంగా తండాలలో నివశిస్తున్న గిరిజనులకు కృష్ణా నీటిని సరఫరా చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్, సంప్ వెల్‌ను బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఎ.కొండూరు మండలంలోని సుమారు 38 గ్రామాల్లో ప్రజలు ఫ్లోరైడ్ నీరు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- **రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు**

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రామంలో పలు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని ఎంపీపీ పాలడుగు జోత్స్న తెలిపారు. గ్రామంలో నిధులు మంజూరు చేసిన రోడ్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచనల మేరకు మూడు రోడ్లు అభివృద్ధి చేసేందుకు రూ.8 లక్షలు మంజూరు చేశామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Governorpet Branch,VIA వారి ...

... నెంబర్ 11478/2024- ...

... Regd. Post with Ack Due ...

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com